

ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న శ్రీరామదాసు, గోవర్ధనచారి తదితరులు

స్వర్ణకారులకు న్యాయం చేస్తా : ఎంపీ ఈటల

చాదర్‌ఘాట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా స్వర్ణకారులకు న్యాయం చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. మంగళవారం గడ్డిఅన్నారంలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం-2025-28 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కీర్తిగారి అనంతాచారి, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామదాసు గోవర్ధనాచారి, కోశాధికారిగా తటుకునూరు రవిచారితో పాటు కార్యవర్గసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సంఘం సభ్యులు సమష్టిగా సంఘం అభివృద్ధి కోసం పని చేయాలని ఆయన కోరారు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి, రంగారెడ్డి జిల్లా సంఘం అధ్యక్షుడు మారోజు జంగాచారి, కార్యదర్శి సంతోష్, సభ్యులు ప్రవీణ్, శ్రీనివాసాచారి, తిరుపతాచారి, నర్సింహచారి, రాచకొండ శ్రీనివాసాచారి, గిరి తదితరులు పాల్గొన్నారు.



వరదనీటి నాలా విషయమై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మన్సూరాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఏ కాలనీలోనూ వరద నీటి సమస్య తలెత్తకుండా దశలవారీగా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో గల చిన్నచెరువుకు ప్రత్యామ్నాయంగా చేపట్టిన వరదనీటి ఔట్‌లెట్ నిర్మాణ పనులను మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ చిన్నచెరువులోకి వర్షపునీరు వచ్చి చేరేలా వరదనీటి నాలా పనులు చేపడుతున్నామని, దీంతో సుమారు 30కాలనీలకు వరదనీటి సమస్య పరిష్కారవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ రమేష్‌బాబు, డీఈ కనకయ్య, ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారం, స్థానికులు కొప్పుల సంజీవరెడ్డి, రంగారెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కర్నూలు బస్సు ప్రమాద బాధితుడికి పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ నరసింహారెడ్డి

హయత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు అగ్ని ప్రమాద ఘటనలో బస్సులో నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్న అందోజు నవీన్‌కుమార్‌ను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని వెంకటేశ్వకాలనీలోని ఇంటి వద్ద చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్‌ను కార్పొరేటర్ కలిసి ఆయన ఆరోగ్య పరిస్థిని తెలుసుకున్నారు. తన ప్రాణాన్ని కాపాడుకుంటునే తోటి వారి ప్రాణాలను కాపాడిన నవీన్‌కుమార్‌ను కార్పొరేటర్ అభినందించారు.

పద్మావతి కాలనీలో మ్యాన్‌హోల్ పరిశీలన



హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో కుంగిపోయిన మ్యాన్‌హోల్‌ను మంగళవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ డీజీఎం ముస్తాఫా అలీ మంగళవారం పరిశీలించారు. మ్యాన్ హోల్ కుంగడానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నూతన మ్యాన్ హోల్ నిర్మాణానికి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

- హయత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)

అనుమతికి విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు సీజ్

ఎల్బీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అనుమతికి విరుద్ధంగా చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్‌బీఐకాలనీ, గడ్డిఅన్నారం ప్రాంతాలలో అనుమతికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ నిర్మాణాలు కొనసాగిస్తుండటంతో ఉపకమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సత్యభామ పర్యవేక్షణలో మంగళవారం టీపీఎస్ సోమేశ్‌కుమార్ సిబ్బందితో కలిసి పోలీసు బందోబస్తుతో వాటిని సీజ్ చేశారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఏటీ, టీఎస్‌జీహెచ్‌ఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి "వార్షిక విద్యార్థుల పోటీలు-2025" మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ విభాగల్లో పోటీలను నిర్వహించారు. మండలంలోని 17 పాఠశాలల నుంచి విద్యార్థులు ఆయా విభాగాల్లోని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం ఎంఈవో జగదీశ్వర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి వారికి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్‌ఎంలు వెంకటరెడ్డి, నర్సయ్య, రమేష్, బిక్షపమయ్య, రీసోర్స్ పర్సన్ పాండునాయక్, ఎస్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు కొర్ర భాస్కర్‌నాయక్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తన్నీరు సత్యనారాయణకు నివాళి



రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు నివాసంలో ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీష్‌యాదవ్, బాలరాజ్‌గౌడ్, భాస్కర్‌యాదవ్, అఖిల్‌యాదవ్, నర్రి మల్లేష్, కొండగిరి, రవి తదితరులు

- మన్సూరాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకుంటున్న వణ్యప్రాణుల ఆకృతులు



కంచన్‌బాగ్‌లో ఫ్లైఓవర్ కింద రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వణ్యప్రాణులు, పక్షుల ఆకృతులు

చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అడవులలో ఉండే వణ్యప్రాణులు, పక్షుల ఆకృతులు రహదారులపై దర్శనమిస్తున్నాయి. కంచన్‌బాగ్ ఫిసల్‌బండ ప్రధాన రహదారిపై ఒవైసీ ఆస్పత్రి ముందు ఫ్లైఓవర్ కింద ఖాళీ స్థలంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పచ్చదనం, పూలమొక్కలతో పాటు వణ్యప్రాణులు, పక్షుల ఆకృతులను ఏర్పాటు చేశారు. రహదారిపై వెళ్లే ప్రయాణికులు, చిన్నారులు వాటిని ఆసక్తిగా తిలకిస్తూ ముందుకు సాగుతున్నారు. ఏనుగు, దుప్పి, ఖడ్గమృగం, జిరాఫీ, నెమలి, గద్ద, కోతి, కొంగ వంటి పలు వన్యప్రాణులు, పక్షులు స్థానికులు, వాహనదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వణ్యప్రాణులు, పక్షుల ఆకృతుల ఏర్పాటు పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి.



ఆకట్టుకుంటున్న వణ్యప్రాణులు, పక్షుల ఆకృతులు

నేడు కార్తీక పౌర్ణమి వేడుకలు

● విద్యుత్ దీపాలతో ధ్యానాంజనేయ స్వామి ఆలయం ముస్తాబు ● భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు



విద్యుత్ దీపాల వెలుగుల్లో కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానం



హనుమాన్ దేవస్థానంలో క్యూ లైన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ఈవో లావణ్య, ధర్మకర్తలు

చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి దేవస్థానం కార్తీక పౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయంలో క్యూలైన్స్ ఇతర ఏర్పాట్లను మంగళవారం ఈవో ఎన్.లావణ్య, ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు పరిశీలించారు. బుధవారం ఉదయం 4:15గంటలకు సుప్రభాతం, 4:30కి పుష్కరిణి పూజ(కోనేరు), 5గంటలకు శ్రీ ధ్యానాంజనేయస్వామికి ప్రత్యేక సింధూర అభిషేకం, 6గంటలకు స్వామి వారికి హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, 6:30గంటలకు స్వామి వారికి అష్టోత్తరములు, అర్చనలు, ఆకుపూజలు, 7:30గంటలకు చండీహోమం, సాయంత్రం 6గంటలకు ఆకాశ దీపారాధన, 7గంటలకు రథోత్సవం, 9గంటలకు స్వామి వారికి హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్.లావణ్య, ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు పేర్కొన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలోని కోనేరులో భక్తుల పుణ్య స్నానాలు, స్వామి వారి దర్శనం, టికెట్ కౌంటర్లు, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు, మహిళలు కార్తీక దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో, చైర్మన్ తెలిపారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొండ్ర సంతోష్‌కుమార్, తోకటి కిరణకుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చాదర్‌ఘాట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలకు మలక్‌పేటలోని ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శాలివాహననగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తెల్లవారుజామున 4గంటల నుంచే ఉసిరి చెట్టు కింద మహిళలు సామూహిక పూజలు, ఒత్తులు కాల్చడం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదేవిధంగా దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్‌లో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సలీంనగర్‌లోని శ్రీషిర్డీ సాయి సంస్థాన్‌లో కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా ఉదయం చండీహోమం, మధ్యాహ్నం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు.



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి వేడుకల ఆహ్వాన పత్రికను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హరీష్‌కు అందజేస్తున్న ఆలయ ఈవో ఎన్.లావణ్య

- చంపాపేట, నవబంబరు 4 (ఆంధ్రజ్యోతి)



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి మహోత్సవ ఆహ్వానపత్రికను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డికి అందజేస్తున్న ఆలయ ఈవో లావణ్య తదితరులు

- చంపాపేట, నవబంబరు 4 (ఆంధ్రజ్యోతి)

'మార్కెట్‌లో ఉల్లి పంట తడవకుండా ఏర్పాట్లు'

ఓల్డ్‌మలక్‌పేట నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తెచ్చే ఉల్లిపంట తడవకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నప్పటికీ మార్కెట్‌కు రైతులు పెద్ద ఎత్తున ఉల్లిపంట తెస్తున్నారని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. వర్షానికి పంట తడవకుండా రైతులకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. మార్కెట్‌కు ఏరోజు వచ్చిన పంటను ఆరోజే కొనుగోలు చేయాలని కమీషన్ ఏజెట్లకు తెలిపామని ఆయన వివరించారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



హయత్‌నగర్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ జాతీయ రహదారిని దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని బైకు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డి పాలెం వద్ద క్యాండోర్ ఫైన్ పాఠశాల ముందు గుర్తు తెలియని వ్యక్తి(45) జాతీయ రహదారిని దాటుతుండగా అదే సమయంలో పెద్దఅంబర్‌పేట్ వైపు నుంచి హయత్‌నగర్ వైపునకు వస్తున్న బైకు అతడిని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108లో హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స ప్రారంభించే లోపే మృతిచెందాడు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే హయత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని సీఐ నాగరాజుగౌడ్ కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రంగారెడ్డి జిల్లా రెవెన్యూ మెజిస్ట్రేట్ సంగీతకు వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ ఉద్యమనేతలు

42శాతం బీసీ రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

మన్సూరాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): న్యాయబద్ధమైన 42శాతం బీసీ రిజర్వేషన్‌ను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఉద్యమ నేతలు కోరారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ మెజిస్ట్రేట్ టీఎల్ సంగీతకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యమ నేతలు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యులు చామకూర రాజు, కేవీ గౌడ్, పెద్ద జగదీష్‌నేత, వీవర్స్ డే ఫౌండర్ ఎరమాద వెంకన్ననేత, ఉపేంద్రయాదవ్, కొండల్ గౌడ్, లింగేష్‌యాదవ్, రాయబండి పాండురంగాచారి, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోర శ్యాంసుందర్, రాపోలు జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

● 200 గ్రాముల గంజాయి,

షికారీ గన్‌కు ఉపయోగించే ఆరు బులెట్లు స్వాధీనం

చాదర్‌ఘాట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయిని తరలిస్తున్న రౌడీషీటర్‌తోపాటు మరో ఇద్దరిని సౌత్ ఈస్ట్ జోన్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి చాదర్‌ఘాట్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి, షికారీ గన్‌కు ఉపయోగించే ఆరు బులెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారీ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట అక్బర్‌బాగ్‌లోని దిల్‌కుషా ఫంక్షన్‌హాల్ వద్ద చాదర్‌ఘాట్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సౌత్ ఈస్ట్ జోన్, ఈస్ట్ జోన్ పోలీసులు ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేశారు. వాహనం డిక్కీలో గంజాయితోపాటు షికారీ గన్‌కు ఉపయోగించే ఆరు బులెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురిలో ఓల్డ్‌మలక్‌పేట నివాసి చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన కాలా ఇమ్రాన్ ఉన్నాడు. ఇతనికి సహకరించిన మలక్‌పేటకు చెందిన బాసిత్, ఆసీఫ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై ఆయుధ నియంత్రణ చట్టంతోపాటు మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మురారీ తెలిపారు. గంజాయిని బండ్లగూడ నుంచి కొనుగోలు చేసి ఓల్డ్‌మలక్‌పేటలో విక్రయించడానికి తీసుకెళ్తున్నామని నిందితులు పోలీసుల విచారణలో అంగీకరించారు.

హయత్‌నగర్‌లో భారీ వర్షం.. రోడ్లు జలమయం

హయత్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో కాలనీలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. హైకోర్టు కాలనీ బీడీఎల్ కాలనీ మీదుగా రాఘవేంద్రనగర్ కాలనీకి భారీగా వరద నీరు వచ్చింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం కూడా అక్కడక్కడ చిరు జల్లులు కురిశాయి. సాయంత్రం ఐదు గంటలకు మరో దఫా భారీ వర్షం కురిసింది.

'మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు- టిప్పర్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రభుత్వం దృష్టిపెట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్ల అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలన్నారు. అధ్వానంగా మారిన రోడ్డులకు వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న వాహనాలపై ఆర్టీఏ అధికారులు దాడులు నిర్వహించాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైనా వైద్యం అందించాలని, వారు కొలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జూబ్లీహిల్స్‌లో ఎల్బీనగర్ నేతల ప్రచారం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా మంగళవారం ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఆయా పార్టీల కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి తమ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా..



జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి సోమాజీగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, అల్లే కుమార్, రాజునాయక్, శివకుమార్, మల్లేష్‌యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, నర్సింహా, రాణప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)



జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా బోరబండలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తో కలిసి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, నర్సింహ, జనార్దన్, యాదయ్య పాల్గొన్నారు.

- చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)



జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- చంపాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా..



జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ రహ్మత్‌నగర్ డివిజన్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కబీర్‌దాస్, భాస్కర్, దిలీప్, ఆదర్శ్ పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)